క్లుప్తంగా

ఆక్రమణదారులకు హెచ్చరిక



వ్యాపారులతో మాట్లాడుతున్న నగర పంచాయతీ సిబ్బంది

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలోని కుమ్మరాంకట్ట సెంటర్‌లో కొందరు వ్యాపారులు రోడ్డు మార్జిన్ దాటి ఆక్రమించడంపై నగర పంచాయతీ అధికారులు శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు రోడ్డు మార్జిన్ దాటి వచ్చిన అక్రమదారులకు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలకు ఇబ్బంది కరంగా ఉండే వ్యాపారాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. డ్రైనేజి కాలువను దాటి కొందరు వ్యాపారులు అక్రమంగా వ్యాపారం కొనసాగించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రతి ఒక్కరూ నగర పంచాయతీ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

దొనకొండ: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని సర్పంచ్ కొంగలేటి గ్రేస్ రత్నకుమారి దేవానంద్ అన్నారు. స్థానిక ఏబీఎం చర్చ్ ఆవరణలో, ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గ్రేస్‌రత్నకుమారి దేవానంద్, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్ రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాలను ప్రారంభించారు. రైల్వే, బస్సు ప్రయాణికులకు, కార్యాలయానికి వచ్చిన ప్రజలకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని సర్పంచ్ తెలిపారు. చీర్ల వెంకటేశ్వర్లు, భట్టు వెంకటేశ్వర్లు, ఆది పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

బేస్తవారిపేట: స్థానిక బస్టాండ్ ఆవరణలో కోనపల్లె సెంటర్‌లో చేయూత మిత్రమండలి ఆధ్వర్యంలో మినరల్ వాటర్ కూలింగ్ మిషన్‌ను శనివారం ఏర్పాటు చేశారు. వేసవిలో విరివిగా చలివేంద్రాలు దాతలు ఏర్పాటు చేయాలని చేయూత మిత్రమండలి సభ్యులు కోరారు. కార్యక్రమంలో దుకాణ యజమానులు శేగు ప్రసాద్, అనంత రామయ్య, తిరుమలనాథం, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, చేయూత మిత్ర మండలి సభ్యులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న షాపుల యజమానులు

ఇఫ్తార్ సాక్షిగా కూటమిలో లుకలుకలు

- రెండు వర్గాలుగా విడిపోయిన టీడీపీ నేతలు
- కార్యక్రమానికి హాజరైన బీజేపీ నేతలకు అవమానం

సాక్షి ప్రతినిధి ఒంగోలు: సింగరాయకొండ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు సాక్షిగా కూటమిలో లుకలుకలు వెలుగుచూశాయి. టీడీపీలో వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ఇఫ్తార్ విందుకు ముస్లిం, మైనార్టీ సామాజికవర్గం కూడా నామమాత్రంగానే హాజరయ్యారన్న ప్రచారం జరిగింది. వాస్తవానికి ఇఫ్తార్ విందును ఈ నెల 7వ తేదీ ఆదివారం ఏర్పాటు చేయాలని టీడీపీ మండల నాయకుడు, మాజీ సర్పంచ్ చెప్పినప్పటికీ మరొక వర్గం శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది. తన మాట పెడచెవిన పెట్టారన్న ఆగ్రహంతో మాజీ సర్పంచ్, అతని మేనల్లుడు ఈ కార్యక్రమానికి నామమాత్రంగా హాజరై పట్టీపట్టనట్లు వ్యవహరించారు. అంతేగాకుండా ఇఫ్తార్ విందు జరిగే ఈద్గమిట్ట దర్గా ప్రాంతానికి సమీపంలోని మసీదుల్లో పోటీగా భోజనాలు పెట్టించారు. ఫలితంగా ముస్లింలు స్వల్పంగా హాజరయ్యారు. నియోజకవర్గంలో పార్టీపరంగా ఇప్పటి వరకూ ఈ మాజీ సర్పంచ్ ప్రధానపాత్ర పోషించాడు. అంతేగాకుండా గత ప్రభుత్వంలో మండల కోఆప్షన్ సభ్యుడిగా ఉన్నాడు. అయితే, పార్టీలో ఇతనంటే గిట్టని అదే సామాజికవర్గానికి చెందిన మరోవర్గం పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తోంది. ఈ నెల 7వ తేదీ ఆదివారం ఈ మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు జరుగుతుందన్న ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. శుక్రవారం జరిగిన ఇఫ్తార్ విందుకు రంజాన్ ఉపవాస దీక్ష తీసుకున్న ముస్లింలు కేవలం చాలా తక్కువ సంఖ్యలో వచ్చారని, ఇతర సామాజికవర్గానికి చెందిన వారు మాత్రం భారీగా వచ్చారని చర్చించుకుంటున్నారు.

బీజేపీ నాయకులకు అవమానం...

ఇఫ్తార్ విందుకు బీజేపీ నాయకులకు ఆహ్వానం అందడంతో ఆ పార్టీ నాయకులు వచ్చారు. విందుకు వచ్చేటప్పుడు పార్టీ కండువాలు వేసుకుని రావద్దని మరీ వారికి ఆంక్షలు విధించారు. బీజేపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మలినేని గీతాంజలి, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివకుమారి, అచింత, జిల్లా కార్యదర్శి తిరుమల, కొండపి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి సుల్తానా, మండల ఉపాధ్యక్షుడు కుంచాల శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశం ప్రారంభమవ్వగానే వేదిక మీదకు టీడీపీ, జనసేన నాయకులను పిలిచారు. వేదిక ముందున్న బీజేపీ నాయకులను విస్మరించారు. చివరికి బీజేపీ ముస్లిం నాయకురాలు సుల్తానాను కూడా వేదిక మీదకి పిలవలేదు. దీంతో వీరు ఆగ్రహం వ్యక్తం చేసి ఇఫ్తార్ విందు చేయకుండానే సమావేశం నుంచి అర్ధంతరంగా వెళ్లిపోయారు. దీనిపై తమ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు బీజేపీ నాయకులు తెలియజేస్తున్నారు. వాస్తవానికి ఈ కార్యక్రమానికి హాజరుకాకూడదని అనుకున్నామని, కానీ పదేపదే ఫోన్ చేసి ఆహ్వానించడంతో వెళ్లామని, తీరా మహిళలు అని చూడకుండా మమ్మల్ని అవమానపరిచారని ఆ పార్టీ మహిళా నాయకురాలు ఆరోపించింది. దీంతో కూటమిలో లుకలుకలు బయటపడ్డాయి.

ఉసురు తీసిన ఈత సరదా



మృతుడు మన్నెం వెంకటేశ్వర్లు



మృతుడు పత్తి వెంకటేశ్వర్లు

- ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి

దొనకొండ: సరదాగా ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృత్యువాతపడిన ఘటన దొనకొండ మండలం ఇండ్లచెరువులో శనివారం జరిగింది. గ్రామస్తులు, బంధువుల సమాచారం మేరకు.. దొనకొండ మండలంలోని మల్లెలవాగులో గంగవరం గ్రామానికి చెందిన రైతులు పంటలు పండించుకునేందుకు జేసీబీలతో 40 అడుగుల పొడవు, 20 అడుగుల లోతు బావులు తవ్వుకున్నారు. మోటార్ల ద్వారా పంటలకు నీరు సరఫరా చేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల యువకులు కొందరు మధ్యాహ్న సమయంలో అక్కడ సరదాగా ఈతకొట్టేవారు. ఈ క్రమంలో శనివారం గ్రామానికి చెందిన పత్తి నారాయణ, సాలమ్మ దంపతుల ఏకైక కుమారుడు పత్తి వెంకటేశ్వర్లు (20), మన్నెం పుల్లమ్మ ఏకైక కుమారుడు మన్నెం వెంకటేశ్వర్లు (25) స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లారు. వారిలో పత్తి వెంకటేశ్వర్లుకు ఈత సరిగ్గా రాదు. అయినా బావిలో దిగడంతో నీటమునిగిపోతుండటాన్ని గమనించి అతడిని రక్షించేందుకు మన్నెం వెంకటేశ్వర్లు వెంటనే బావిలో దిగాడు. కొంత సేపటికి ఇద్దరూ నీట మునిగి ఊపిరాడక మృతిచెందారు. గ్రామస్తులు, బంధువులకు అక్కడున్న స్నేహితులు సమాచారం అందించారు. వెంటనే తల్లిదండ్రులు, బంధువులు వెళ్లి ఇద్దరినీ బయటకు తీశారు. చేతికి అందివచ్చిన కొడుకులు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామస్తులు, బంధువుల ఆర్తనాదాలతో గ్రామం శోకసంద్రమైంది. పత్తి వెంకటేశ్వర్లు పదో తరగతి ఫెయిలై తల్లిదండ్రులతో పొలం పనులకు వెళ్తుండగా, మన్నెం వెంకటేశ్వర్లు డిగ్రీ వరకు చదువుకున్నాడు. సంఘటన స్థలాన్ని ఏఎస్‌ఐ కె.శ్రీనివాసరావు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సొంత గూటికి చేరిన కో ఆప్షన్ సభ్యుడు



ఎమ్మెల్యే కేపీతో కో ఆప్షన్ సభ్యుడు దమ్మాల

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ కో ఆప్షన్ సభ్యుడు దమ్మాల జనార్దన్ ఇటీవల టీడీపీలోకి వెళ్లి అక్కడ వారి వ్యవహారశైలిపై అసంతృప్తి చెంది తిరిగి తన సొంత పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గిద్దలూరు అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి సమక్షంలో శనివారం పార్టీ కండువా కప్పుకున్నారు. నగర పంచాయితీ పరిధిలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, కాపు సంఘ నాయకులు కావేటి ఈశ్వర్‌నాయుడు, ఆర్యవైశ్య సంఘ నాయకులు బాదం గోపాల్, పర్చూరి నాగేశ్వరరావు, గర్రె వెంకటేశ్వర్లు, బాదం వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

21 మంది వలంటీర్లు రాజీనామా



తర్లుపాడులో రాజీనామా పత్రం అందిస్తున్న వలంటీర్లు

తర్లుపాడు: మండలంలోని పోతలపాడు, నాగెళ్లముడుపు, కలుజువ్వలపాడు, సచివాలయాలకు చెందిన 21 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజీనామా ప్రతాన్ని ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు శనివారం అందించారు. 50 నెలల పాటురాజకీయ పక్షపాతం లేకుండా నిస్వార్థంగా సేవలు అందించామని, సొంత లాభం కోసం కొందరు తమకు రాజకీయాలు ఆపాదించారని మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు వివరించారు. కొన్ని ఎల్లో పత్రికలు, మీడియాల్లో తమపై దుష్ప్రచారం చేయడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాజీనామా చేసిన వారిలో రవితేజ, మీరావలి, సురేష్, గురవయ్య, తిరుపతయ్య, వెంకట రామాంజనేయులు, బైరెడ్డి వెంకటరెడ్డి, సుభాషిణి, చిన్న గురవయ్య, అన్నపూర్ణ, భ్రమరాంబిక, ప్రభాకర్, గురవయ్య, శ్రావణి, సీహెచ్ శ్రీదేవి, చంద్రకళ, రాజశేఖర్, బాబూ, పి. బాలంకమ్మ, రాజేశ్వరి, మరియమ్మ పాల్గొన్నారు.

బ్రహ్మంగారి గుడిలో హుండీ చోరీ



పొలాల్లో హుండీని పరిశీలిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ విఘ్నేష్

కురిచేడు: స్థానిక దర్శి రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో హుండీని శుక్రవారం రాత్రి చోరీ చేశారు. శనివారం ఆలయ నిర్వాహకులు పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయానికి వచ్చే సరికి తలుపు తీసి ఉంది. ఆలయంలో హుండీ లేకపోవడంతో పరిసరాలు పరిశీలించారు. దక్షిణం వైపు ఇనుప గేటుకు లోపల వైపు వేసిన తాళం తీసి ఉంది. ఆలయంలో ఉత్తరం వైపు ఉన్న నిచ్చెన దక్షిణం వైపు ప్రహరీ ఉంది. హుండీని రెండు చేల అవతలకు తీసుకెళ్లి పగలగొట్టి అందులోని డబ్బులు తీసుకెళ్లారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి అదృశ్యం

మద్దిపాడు: కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. నాగులుప్పలపాడు మండలం మద్దిరాలకు చెందిన బత్తిన కోటేశ్వరరావు (36) భార్య, పిల్లలతో కలిసి సంవత్సరం నుంచి మద్దిపాడు ఎస్సీకాలనీలో నివాసం ఉంటున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో పాటు శనివారం తన మేనల్లుడు గుంటూరి వెంకట సుధాకర్‌కు వాట్సాప్‌లో వీడియో పంపాడు. తాను జీవితంపై విరక్తి చెంది ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఆ వీడియోలో తెలపడంతో అతనిని వెతికి అప్పగించాలంటూ మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో గుంటూరు వెంకట సుధాకర్ ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఏఎస్‌ఐ రమేష్‌కృష్ణ కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించి ఫోన్ సిగ్నల్‌ను ట్రాక్ చేయించగా, హైదరాబాదులోని అఫ్జల్ గంజ్ గౌలిగూడ వద్ద ఉన్నట్లు తెలిసింది. దీంతో అతనిని ట్రాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మద్దిపూడి: గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. బంధువులు తెలిపిన వివరాలు మేరకు.. మండలంలోని శివరాయునిపేట గ్రామానికి చెందిన మన్నెం బాల బ్రహ్మయ్య (40) వరంగల్ జిల్లాలో బేల్దారీ మేస్త్రీగా పనిచేస్తుంటాడు. అయితే ఆ పని కలిసిరాకపోవడంతో స్వగ్రామమైన శివరాయునిపేట గ్రామంలో జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 3న సొంత పనుల నిమిత్తం శివరాయునిపేట గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై పొదిలి బయలుదేరాడు. కెల్లంపల్లి గ్రామం సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో బాల బ్రహ్మయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. బాలబ్రహ్మయ్య చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు.

పురుటి నొప్పుల భయంతో గర్భిణి బలవన్మరణం



ఉరి వేసుకుని మృతి చెందిన రాగసాని వెంకట పద్మావతి

సీఎస్‌పురం (పామూరు): పురిటినొప్పులు తట్టుకోలేననే భయానికి గురైన గర్భిణి ఉరివేసుకుని మృతిచెందిన ఘటన శుక్రవారం ప్రకాశం జిల్లా సీఎస్‌పురం మండలంలోని కొండబోయినపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. సీఐ రామానాయక్, ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాలు... కొండబోయినపల్లి గ్రామానికి చెందిన రాగసాని రమణయ్య, వెంకట పద్మావతి (26)లకు ఇద్దరు ఆడపిల్లలు. వెంకట పద్మావతికి తొలి రెండు కాన్పులు సాధారణ కాన్పులు అయ్యాయి. ఆ సమయంలో తీవ్రమైన పురుటి నొప్పులతో బాధను అనుభవించింది. వెంకట పద్మావతి మూడో సారి గర్భిణికాగా కాన్పు సమయం దగ్గరపడుతోంది. ఈ నేపథ్యంలో పురుటి నొప్పులు తట్టుకోలేనేమోనన్న భయం ఆమెను వెంటాడింది. చుట్టుపక్కల వారు, తల్లిదండ్రులతో పాటు, భర్తకు తన ఆవేదన చెప్పుకుంది. దీంతో ఈదఫా సిజేరియన్ ఆపరేషన్ చేయించేందుకు వారు అంగీకరించారు. అయినా తీవ్రమైన మానసిక ఆందోళనతో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో పద్మావతి ఇంటి పైకప్పు రేకులకు ఉండే రాడ్‌కు చీరతో ఉరివేసుకుంది. కొంతసేపటి తరువాత చూసిన కుటుంబ సభ్యులు వెంటనే సీఎస్‌పురం వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే పద్మావతి మృతిచెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. దీనిపై మృతురాలి తండ్రి కామనబోయిన తిరుపతయ్య శనివారం తన కుమార్తె ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి



మృతి చెందిన ప్రసన్న

కొమరోలు: అనుమానాస్పద స్థితిలో తీవ్ర గాయాలతో ఓ గర్భిణి మృతి చెందింది. ఈసంఘటన కొమరోలులోని చర్చి వీధిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. కొనకనమిట్ల మండలంలోని మునగపాడు గ్రామానికి చెందిన లంకోజి ప్రసన్న (30)కు మండలంలోని మొట్టుపల్లె గ్రామానికి చెందిన లంకోజీ నారాయణకు 15 ఏళ్ల క్రితం పెద్దలు వివాహం చేశారు. గతకొంత కాలంగా మొట్టుపల్లె గ్రామంలో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులు అనంతరం 4 నెలల క్రితం కొమరోలులోని చర్చి వీధిలో ఓ ఇంటిలో బాడుగకు చేరారు. నారాయణ కార్పెంటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం తన నాలుగేళ్ల పాపను నారాయణ.. పని వద్దకు తీసుకుని వెళ్లి తిరిగి వచ్చే సరికి 4 నెలల గర్భిణీ అయిన లంకోజీ ప్రసన్న బాత్‌రూంలో జారిపడి తలకు తీవ్ర గాయాలై మృతి చెంది ఉందని తెలిపాడు. ప్రసన్న కుటుంబ సభ్యులకు నారాయణ సమాచారం అందించడంతో అక్కడకు చేరుకున్న ఆమె సోదరుడు యద్దనపూడి గురుసాయి.. మృతిపై అనుమానం ఉన్నట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గిద్దలూరు వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

జగనన్న సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దర్శి: నియోజకవర్గంలోని ప్రజలందరూ హాజరై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేస్తున్న మేమంతా సిద్ధం సభను జయప్రదం చేయాలని దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వెంకాయమ్మ కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో వారు శనివారం సమావేశమయ్యారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం పొదిలి మార్కాపురం రోడ్డులో జంక్షన్ వద్ద మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని కోరారు. ఆ తర్వాత దర్శికి బస్సు యాత్ర బయల్దేరి వస్తుందని చెప్పారు. దర్శిలో ప్రోగ్రాం అనంతరం 8వ తేదీ కురిచేడులో 9 గంటకు జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. కార్యకర్తలు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్నీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కొమరోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సారె వెంకట నాయుడు కోరారు.



ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: నియోజకవర్గం పొదిలి సమీపంలోని కొనకనమిట్ల అడ్డరోడ్డు వద్దకు ఆదివారం సాయంత్రం బస్సు యాత్ర చేరుకుంటుందని, మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున హాజరై బస్సు యాత్రను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మార్కాపురం: నియోజకవర్గంలోని కొనకనమిట్ల జంక్షన్ వద్ద జరిగే మేమంతా సిద్ధం సభను జయప్రదం చేయాలని మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే అన్నా రాంబాబు శనివారం విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదివారం సాయంత్రం నాలుగున్నర గంటలకు కొనకనమిట్ల జంక్షన్‌లో జరిగే సభలో ప్రసంగిస్తారని, నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు



ప్రచారం చేస్తున్న కల్పనరెడ్డి

గిద్దలూరు రూరల్: జగనన్న పరిపాలనలో రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని వైఎస్సార్ సీపీ గిద్దలూరు అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి సతీమణి కల్పన అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 5వ వార్డు పరిధి సాయిక్రిష్ణ నగర్, డీఆర్ఆర్ అపార్ట్‌మెంట్ వీధుల్లో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. 5వ వార్డు కౌన్సిలర్ సుభాషిణి ఇంటి వద్ద కల్పనారెడ్డికి ఘన స్వాగతం పలికి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తిరిగి జగనన్న ముఖ్యమంత్రి కావాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలన్నారు. గిద్దలూరులో నాగార్జునరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. చైర్మన పాముల వెంకట సుబ్బయ్య, వైస్ చైర్మన్‌లు ఆర్‌డీ రామకృష్ణ, కాతా దీపికా, కౌన్సిలర్లు పర్చూరి సుభాషిణి, దొంతా లక్ష్మీదేవి, మానం బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు చేరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, పర్చూరి నాగేశ్వరరావు, గుల్లా రామకృష్ణారెడ్డి, షేక్షావలి, ఆర్యవైశ్య సంఘ నాయకులు బాదం గోపాల్, కాపు సంఘ నాయకులు కావేటి ఈశ్వర్, జానకి రంగనాయకులు, దేమా శ్రీరాములు యాదవ్, పోలెపల్లె శివ, పాలుగుళ్ల నరసింహారెడ్డి, సునిల్‌రెడ్డి, షేక్ మస్తాన్‌వలి, పగడాల వెంకటేశ్వర్లు, బాలచెన్నయ్య, ముద్దర్ల శ్రీనివాసులు, బండారు నిర్మలాదేవి, బెల్లం రమాదేవి, అప్పర్లరెడ్డి, దళిత సంఘ నాయకుడు పెరికె జయరావు, మత్తయ్య, పాల్గొన్నారు.

ఘనంగా బూచేపల్లి జన్మదిన వేడుకలు

- బూచేపల్లిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన చెవిరెడ్డి, మంత్రి మేరుగు
- భారీగా తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు



బూచేపల్లి కుమారుడికి కేక్ తినిపిస్తున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి



కేక్ కట్ చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: పట్టణంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి పుట్టినరోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునలు శివప్రసాద్ రెడ్డిని కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. బూచేపల్లిని ఘనంగా సత్కరించారు. వేలాది మంది కార్యకర్తలు బూచేపల్లి నివాసానికి చేరుకుని వినూత్న రీతిలో భారీ ఎలక్ట్రికల్ గజమాలను శివప్రసాద్‌రెడ్డికి వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పార్టీ కార్యాలయంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేరుతో వినూత్న రీతిలో ఒక్కో అక్షరానికి ఒక కేక్‌ను ఏర్పాటు చేసి ఆయనతో కట్ చేయించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని జెడ్పీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు వేలాది మంది హాజరై గజమాలలతో బూచేపల్లి కుటుంబాన్ని ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతో బూచేపల్లి నివాసం, వైఎస్సార్ సీపీ కార్యాలయం కిటకిటలాడింది. శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన వారందరికీ భోజన సౌకర్యాలు కల్పించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి సతీమణి నందినీలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శుభాకాంక్షలు తెలిపిన అందరికీ పేరు పేరునా బూచేపల్లి ధన్యవాదాలు తెలిపారు. తాళ్లూరు, కురిచేడు, ముండ్లమూరు, దొనకొండ మండలాల్లో బూచేపల్లి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎక్కడికక్కడ నాయకులు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



బూచేపల్లికి శుభాకాంక్షలు తెలుపుతున్న మేరుగు నాగార్జున

వైఎస్సార్ సీపీలో చేరిన 50 కుటుంబాలు



కేపీ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రాష్ట్రాభివృద్ధికి బాటలు వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే తాముంటామంటూ త్రిపురాంతకం మండలం లేళ్లపల్లి, వెల్లంపల్లి, త్రిపురాంతకం గ్రామాల్లోని టీడీపీకి చెందిన 50 కుటుంబాల వారు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ మేరకు ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ వారికి కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో జగనన్న పేద ప్రజలకు చేసిన మేలు మరువలేనిదన్నారు. తమతో పాటు తమ గ్రామాలను మరింతగా అభివృద్ధి చేసుకునేందుకు టీడీపీకి చెందిన సానుభూతిపరులు స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరడం ఆనందంగా ఉందన్నారు. త్రిపురాంతకం మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు నీలం లాజరస్, లేళ్లపల్లి మాజీ సర్పంచ్ దార్ల ఐజయ్య ఆధ్వర్యంలో దార్ల మధు, దార్ల ప్రసాద్, పరిమి మార్తమ్మ, దార్ల కొండయ్య, ఎనిబెర శంబయ్య, ఎనిబెర తెల్లయ్య, ఎనిబెర తిమోతి, దార్ల దేవయ్య, దార్ల నాసరయ్య, దార్ల దేవదానం, దార్ల యోబు, బోయలపల్లి సుదర్శనం, దార్ల యోసోబు, గంపల రాజారావు, గంపల అబ్రహాం, బోయలపల్లి భాగ్యారావు, దార్ల యేసోబు, దార్ల రవి, దార్ల యోహాను, దార్ల పిచ్చయ్య, పరిమి యోహాను, గుడిమెట్ల రాజు, గంగవరపు వెంకటేశ్వర్లు, కత్తి సుబ్బయ్య, దూపాటి సుబ్బారావు, ఈదర మల్లయ్య, ఈదర శాయి, బొందలపాటి చిన్న, గజ్జల విజయుడు, కొమ్ము కిరణ్‌కుమార్, బొందలపాటి జాన్, దార్ల ఆశీర్వాదం, యద్దనపూడి గురవయ్య టీడీపీ వీడి వైఎస్సార్ సీపీలో చేరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిక

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీకి రోజురోజుకూ గ్రామీణ ప్రాంతాల్లో విశేష ఆదరణ లభిస్తోందని ఆ పార్టీ గిద్దలూరు అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. అర్ధవీడు మండలం గన్నెపల్లెకు చెందిన 20 టీడీపీ కుటుంబాల వారు శనివారం పట్టణంలోని కేపీ నివాసంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువాలు కప్పుకున్నారు.

15 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో బూచేపల్లి వెంకాయమ్మ

ముండ్లమూరు: మండలంలోని పెదరావిపాడు గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరాయి. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైస్ ఎంపీపీ బంకా రమణ నాగిరెడ్డి, భద్రి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పెదరావిపాడు గ్రామానికి చెందిన నలబోతు శ్రీను, పంబా ఏడుకొండలు మరో 15 కుటుంబాల వారు జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, నందిని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ మేడికొండ జయంతి, మండల పార్టీ మాజీ కన్వీనర్ సూర్యదేవర అంజయ్య, రెడ్డి సంఘ జిల్లా అధ్యక్షుడు మేకల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పాలడుగు చిరంజీవి పాల్గొన్నారు.

పేదలు-పెత్తందారులకు మధ్యే ఎన్నికలు

● తాటిపర్తి చంద్రశేఖర్



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి

పెద్దారవీడు: రాష్ట్రంలో పేదలకు, పెత్తందారులకు మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని మద్దలకట్ట, మాచరాజుకుంట, చాట్లమడ అగ్రహారం, బద్వీడుచెర్లోపల్లి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో మా ఊరికి మా చంద్రశేఖరన్న ఎన్నికల ప్రచారం శనివారం చేశారు. వారికి స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి గెలిపిస్తే స్వర్ణయుగాన్ని చూడవచ్చన్నారు. అవినీతి, బినామీ, దోపిడీదారులు కలిసి వస్తున్నారని, చాలా జగ్రత్తగా ఉండాల్నారు. చంద్రబాబు ఇచ్చిన మాటను ఏనాడూ నెరవేర్చలేదని, ఇప్పుడు మరోసారి మోసం చేసేందుకు మీముందుకు వస్తున్నాడని పేర్కొన్నారు. మీ ఇంటిలో మేలు జరిగి ఉంటేనే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, తనను గెలిపించాలని తాటిపర్తి కోరారు. గతంలో టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మరోసారి సీఎంగా చేయాలని ఆయన ప్రజలను కోరారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు వెన్నా హనుమారెడ్డి, మాజీ జెడ్పీటీసీ, ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దుగ్గెంపుడి వెంకటరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు తోకల ఆవులయ్య, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, ఎంపీటీసీ ముడమంచు రాజమ్మ, సర్పంచులు గుంటూ గాలెమ్మ, పాలగిరి రామాంజనేయరెడ్డి, మాజీ ఎంపీపీ జడ్డా చిన్నరాజయ్య, మాజీ సర్పంచ్ మూల లక్ష్మీరెడ్డి, నాయకులు మూల దాసిరెడ్డి, ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, మూల సత్యంరెడ్డి, గాదం మల్లికార్జున, మూల శ్రీనివాసరెడ్డి, దుద్దెల కోటిరెడ్డి, ఏర్వ తిరుమలకొండారెడ్డి, మూల రమణారెడ్డి, మాడుగుల వెంకటేశ్వరరెడ్డి, ముడమంచు రాజారావు, గుమ్మా శ్రీరాములు, మూల రామకోటిరెడ్డి, వెన్నా శివకృష్ణారెడ్డి, వజ్రాల ఆదిరెడ్డి, దుద్దెల వెంకటరెడ్డి, గాలి రమణారెడ్డి, గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నరాల రామచంద్రుడు పాల్గొన్నారు.



